**కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోండి**




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

**ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో ఎన్నో లాభాలు**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 279 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 07 రూ - 03/- శుక్రవారం 04 అక్టోబర్ 2024




## వన్ స్టేట్ - వన్ కార్డ్ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ను

# ప్రవేశ పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం...

**హైదరాబాద్, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా, మరింత సమర్థవంతంగా అమలు చేయడానికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వన్ స్టేట్ - వన్ కార్డు ఆలోచనతో చేపట్టిన ఈ బహుళ ప్రయోజన కార్డుల జారీ ప్రక్రియను ప్రజలంతా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఫ్యామిలీ డిజిటల్ కార్డు రూపకల్పనకు సంబంధించిన సర్వే పత్రాలను సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని సిఖ్ విలేజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రాధాన్యతను ముఖ్యమంత్రి వివరించారు.రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు (30) శాఖలు (30) రకాలుగా సమాచారం వివరాలు 2లో



## పిచ్చోడి చేతిలో రాయిలా

# రేవంత్ రెడ్డి పాలన

**• ఫార్మాసిటీ భూముల్లో రియల్ దందా • మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ**

**హైదరాబాద్, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** రేవంత్ రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. హైదరాబాద్ సమీపంలో ఫార్మాసిటీ కోసం 15 వేల ఎకరాలు మాజీ సీఎం కేసీఆర్ సేకరించారని గుర్తుచేశారు. ఫార్మాసిటీకి అన్ని అనుమతులు వచ్చిన చోట ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు.. దీని కోసం రేవంత్ ప్రభుత్వం పచ్చని పొలాలు లాక్కుంటుందని ఆరోపణలు చేశారు. 'రేవంత్ రెడ్డి నువ్వు రియల్ ఎస్టేట్ బ్రోకర్ వా.. లేక ముఖ్యమంత్రివా' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం , ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై హరీష్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. వివరాలు 2లో

## హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో

# మూడురోజులు వర్షాలు..



**హైదరాబాద్, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో మరో మూడురోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దాంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలుపడే అవకాశం ఉందని చెప్పింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలుపడే ఛాన్స్ ఉందని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలలో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.శనివారం నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల వానలు కురుస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఇవాళ నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిశాయి. నాగర్ కర్నూల్ జిల్లా వెల్టూరులో అత్యధికంగా 7.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు

# భూమి ఇవ్వాలి

**• తగిన నష్టపరిహారం ఇవ్వకుంటే ఆందోళన తప్పదు**

**• ప్రభుత్వాన్ని హెచ్చరించిన ఎంపి ఈటెల రాజేందర్**



**హైదరాబాద్, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) వరకు ప్రధానమైన నాలుగు రహదారులు విస్తరణ విషయంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం లేదా భూమి కేటాయించాలని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూ నిర్వాసితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హెచ్చరించారు. పేద రైతుల స్థలాలను గుంజుకుని రైతులను బిచ్చగాళ్లను చేస్తానంటే ఎవరు ఊరుకోరని ఆయన హెచ్చరించారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని అన్నారు. హైదరాబాద్ ధర్నాచౌక్‌లో ట్రిపుల్ ఆర్ రోడ్డు విస్తరణ సందర్భంగా భూనిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థలాలు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా స్థలాలు, ఆర్థిక సహకారాన్ని అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ట్రిపుల్ ఆర్ చుట్టుపక్కల ఉన్న రైతులంతా వివరాలు 2లో

# ఓటర్ల తుది జాబితా విడుదల

**• స్థానిక పోరుకు ఎన్నికల కమిషన్ సంసిద్ధత**




**హైదరాబాద్, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో 12,867 పంచాయతీల్లో 1,67,33,584 మంది ఓటర్లున్నట్టు తెలిపింది. ఇందులో 82,04,518 పురుషులు, 85,28,573 మహిళలు, 493 ఇతరులు ఉన్నారని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల కన్నా మహిళలే అత్యధికంగా ఉన్నట్టు ఈసీ గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం వార్డులు, పంచాయతీల రిజర్వేషన్ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. రిజర్వేషన్ల పక్రియ కొలిక్కి వస్తేనే ఎన్నికల నిర్వహణకు అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది. కులగణన పూర్తి చేసిన తరువాతే రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో కులగణన పూర్తయి, రిజర్వేషన్లు ఖరారయ్యాకే ఎన్నికలు జరగనున్నాయి.

## కెటిఆర్‌ను వదలని

# కొండా సురేఖ

**• కెసిఆర్ కనిపించకపోవడంలో కెటిఆర్ పాత్ర**

**• ఫామ్‌హౌజ్‌లో ఏమైనా చేశాడేమోనని అనుమానం**

**• ప్రజలు పోలీస్ స్టేషన్ వెళ్లి కేసు పెట్టాలని సూచన**

**• మరోమారు ఘాటు విమర్శలు చేసిన మంత్రి**






## సిఎంను కలిసి కృతజ్ఞతలు

# తెలిపిన పట్నం

**హైదరాబాద్, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి,ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తెలంగాణ శాసమండలి చీఫ్ విప్ గా నియమితులైన సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిసి సత్కరించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి గారు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి గారు , మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం సుధీర్ రెడ్డి గారు, మేడ్చల్ ఇంచార్జ్ వజ్రాష్ యాదవ్ గారు , ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి గారు , అంబర్ పేట్ నియోజకవర్గ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి, గడ్డం రాజేందర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.



## వైవాహిక అత్యాచారం

# నేరం కాదు: కేంద్రం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే తగిన విధంగా శిక్షలు ఉన్నాయని వెల్లడించింది. ఇది చట్టబద్ధమైన అంశానికి మించిన సామాజిక సమస్య అని.. సమాజంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని తెలిపింది. అందుకే దీనిపై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు భాగస్వామ్యపక్షాలతో విస్తృత సంప్రదింపులు జరపాల్సిన అవసరముందని స్పష్టం చేసింది. సర్వోన్నత న్యాయస్థానం లో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలంటూ సుప్రీం కోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలోకి రాదని.. అన్ని రాష్ట్రాలు లేదా ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా దీనిపై ఓ నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేసింది.

## ఈ వివాదాన్ని ఇంతటితో ముగించండి:

## సినీ ప్రముఖులకు పీసీసీ చీఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్:అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి కొండ సురేఖ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. మంత్రి వ్యాఖ్యలపై సినీ ప్రముఖులు తీవ్రంగా స్పందించారు. సోసల్ మీడియాలో మంత్రి వ్యాఖ్యలు ఖండిస్తూ పోస్టులు పెడుతున్నారు. దీంతో కాంగ్రెస్ టీపీసీసీ చీఫ్ వెంటనే రంగంలో దిగి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియోను షేర్ చేశారు."సినీ ప్రముఖులకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి.. ఈ ఎపిసోడ్‌ని ఇంతటితో ముగించండి. మంత్రి కొండా సురేఖ భేషరతుగా వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నారు. ఇరువైపులా మహిళలే ఉన్నారు. ఇక్కడికే ముగిస్తే సమంజసంగా ఉంటుంది. కేటీఆర్ సోషల్ మీడియాలో మంత్రి మీద చేసిన ట్రోల్స్ కూడా సినిమా పెద్దలు గమనించాలి" మహేష్ కుమార్ గౌడ్ కోరారు.



## వన్ స్టేట్ - వన్ కార్డ్ఫ్యామిలీ డిజిటల్ కార్డ్‌ను ప్రవేశ పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం...

(మొదటి పేజీ తరువాయి)

సేకరించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి.అలా కాకుండా అర్హులైన వారందరూ ఒకే కార్డు ద్వారా ఈ సేవలు పొందడానికి వీలుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు అందజేస్తారు.ఇందుకోసం (3) నుంచి (5) వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. ప్రతిపక్షాలు దీనిపై ఎవైనా సూచనలు, సలహాలు ఉంటే ఇవ్వాలి.కుటుంబంలో సభ్యులు పెరిగినందున ప్రజలంతా కుటుంబ డిజిటల్ కార్డు కోసం వివరాలను నమోదు చేయించుకోవాలి. ఇందులో అవసరమైన మార్పుచేర్పులు ఎప్పుడైనా చేసుకోవచ్చు.ఒక్క క్లిక్ తో కుటుంబ సమగ్ర సమాచారం ఉండాలన్న ఆలోచనతో ఈ విధానం తీసుకొచ్చాం.ఒకసారి కార్డు పొందిన తర్వాత రేషన్ తో పాటు ఇతర ప్రభుత్వ సౌకర్యాలను ఎక్కడి నుంచైనా పొందడానికి వీలుంటుంది. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు భూమి ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ ధర్నాలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్,బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలా శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎంపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఐక్యవేదిక నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం, స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా రైతులను పట్టించుకోకుండా బిచ్చగాళ్లను చేస్తామంటే ఎవరూ ఊరుకోరని ఈటల రాజేందర్ హెచ్చరిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు తన వంతు న్యాయం చేస్తానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు.

## పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ రెడ్డి పాలన

(మొదటి పేజీ తరువాయి)

మూడు, నాలుగు వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేసి.. మిగిలిన 10 వేల ఎకరాలను ప్లాట్లు చేసి అమ్మే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. బంగారం లాంటి పంట పండే భూముల్లో ఫార్మాసిటీ ఎందుకని నిలదీశారు. మూసీ సుందరీకణ పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ' గరీబీ హఠావో అంటే రేవంత్ కిసాన్ హఠావో' అంటున్నారని విమర్శలు చేశారు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని అడిగారు. వరంగల్ డిక్లరేషన్‌లో అసైన్డ్ భూములను పట్టా భూములు చేస్తానని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ముందు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ ఇప్పటికైనా స్పందించు.. రేవంత్‌కు మొట్టికాయలు వేసి హామీలు అమలు చేయించాలని కోరారు. బతుకమ్మ పండుగ వచ్చినా రైతుబంధు రాలేదని ఎద్దేవా చేశారు.రుణమాఫీ పేరుతో దేవుళ్లనూ రేవంత్ మోసం చేశారని ÷ర్ అయ్యారు. న్యాల్‌కల్ మండలంలో తలపెట్టిన ఫార్మాసిటీ భూ సేకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోమని.. అవసరమైతే గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్తామని హెచ్చరించారు. రైతుల పోరాటానికి అండగా ఉంటామని హామీఇచ్చారు. రైతుల జోలికి వస్తే రేవంత్ రెడ్డికి బుద్ధి చెబుతామని వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్ శివారులో ఫార్మాసిటీ ఏర్పాటు చేయకుంటే ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని కోరారు. మూసీని మంచిగా చేస్తానని ఫార్మాసిటీ పేరుతో మంజీరా నదిని కలుషితం చేస్తావా అని ప్రశ్నించారు. భూసేకరణను అడ్డుకుంటామని.... తానే వచ్చి బుల్డోజర?లకు ఎదురు నిలబడతానని అన్నారు. రేవంత్‌ది నకిలీ ఇందిరమ్మ పాలన అని విమర్శించారు. సీఎం కుర్చీ కోసం రేవంత్ రెడ్డి అన్ని పార్టీలు మారారని విమర్శించారు. పోరంబోకు, రాళ్లురప్పల భూముల్లో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని.. వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేయొద్దని సీఎం రేవంత్‌రెడ్డిని హరీష్‌రావు కోరారు.

## మూడు ఫామ్‌హౌజ్‌లు ఎక్కడో చూపండి: సబిత



**హైదరాబాద్,అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాకొడుకులకు మూడు ఫామ్ హౌజ్‌లు ఎక్కడ ఉన్నాయో చూపాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సవాల్ చేశారు. కుమారుల ఫాంహౌస్‌లు కూల్చాలా? వద్దా?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సబిత స్పందించారు. ఆత్మాభిమానం కన్నా మించిన ఆస్తి లేదని నమ్మిన వ్యక్తినని చెప్పారు. సీఎంగానీ, ఇంకెవరైనా వ్యక్తుల ముందుగానీ ' పేద ఏడుపులు' ఏడ్చిన సందర్భం నాకు దేవుడు కలిగించలేదు. ముఖ్యమంత్రిని, ఆయన మాట తీరుని తెలంగాణ సమాజం గమనిస్తోంది. మా అబ్బాయి కడుతున్న 'ఇల్లు' మినహాయించి, మిగతా మూడు ఫాంహౌస్‌లు ఎక్కడ ఉన్నాయో బయటపెట్టండి. వ్యక్తిగతంగా ఎన్ని రకాలుగా టా÷-గ్గ్గ÷ట్ చేసినా ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటా'అని సబితా ఇంద్రారెడ్డి ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# నూతన ప్రజా గ్రంథాలయమును ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి











**సంగెం, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.గురువారం రోజున సంగెం మండలం తీగరాజు పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయమును పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి రియాజ్ ప్రారంభించారు. రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలను నాటారు. గ్రామంలోని ప్రజలు, మహిళలు కోలాటాలు, డప్పు చప్పులతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. రైతు వేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ....ప్రజా గ్రంథాలయాలు ప్రతి గ్రామంలో అవసరమని, గ్రంథాలయాల ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు.ప్రస్తుతం గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటుకు ఒక గదిని కేటాయించాలన్నారు.నిరుద్యోగులకు విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రంథాలయాలను గ్రామాలలో ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకోసం గ్రామంలోని ఎన్నారైలు, ప్రభుత్వ ఉద్యోగులు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రంథాలయాలను పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు.గ్రంథాలయాలకు వస్తున్న పన్నులను ప్రజా గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలనీ, గ్రామ ప్రజల సహ కారంతో ఏర్పాటు చేసుకోవాలన్నారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. దారిద్ర రేఖకు దిగువ ఉన్న వారిని అభివృద్ధి చేసేందుకు వారి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా కృషి చేయడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆర్థిక క్రమశిక్షణతో, ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలలో ప్రాధాన్యత క్రమంలో భాగంగా ఒక్కొక్కటి అమలు చేస్తూ, ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్క రైతుకి రైతు రుణమాఫీ చేస్తామని, అర్హులైన ప్రతి పేదలకి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందజేస్తామని తెలిపారు.రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానాని, ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తానని అన్నారు. తీగరాజు పల్లి ప్రజా గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని, గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలను సమకూర్చితానని తెలిపారు. గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయాలను గ్రామ ప్రజలు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కెటిఆర్‌ను వదలని కొండా సురేఖ

- కెసిఆర్ కనిపించకపోవడంలో కెటిఆర్ పాత్ర
- ఫామ్‌హౌజ్‌లో ఏమైనా చేశాడేమోనని అనుమానం
- ప్రజలు పోలీస్ స్టేషన్ వెళ్లి కేసు పెట్టాలని సూచన
- మరోమారు ఘాటు విమర్శలు చేసిన మంత్రి



**సిద్దిపేట,అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ పర్యటన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని తమపై పిచ్చి రాతలు రాయిస్తున్నారని మండిపడ్డారు. తొమ్మిది హామీలు అమలు చేస్తే పదో హామీ ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. పదవీ కాంక్షతో కేసీఆర్‌ని కేటీఆరే ఏదో చేశారన్న ప్రచారం జరుగుతోంది. కేటీఆర్ సీఎం అనుకుని పిచ్చి నిర్ణయాలు తీసుకున్నారు. భారాస ఓడిపోవడానికి ప్రధాన కారణం ఆయనే. బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ మళ్లీ కనిపించలేదు. ఫామ్‌హౌస్‌లో ఏం చేస్తున్నారో తెలియదు. గజ్వేల్‌లో కేసీఆర్ కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో భాజపా, భారాస మధ్య చీకటి ఒప్పందం జరిగింది. కవిత బెయిల్ కోసం ప్రధానితో మాట్లాడి ఒప్పందం చేసుకుని.. భారాస నుంచి భాజపాకు క్రాస్ ఓటింగ్ జరిగిందని కొండా సురేఖ ఆరోపించారు. కేటీఆర్‌కి పదవి కాంక్ష ఎక్కువ.. కేసీఆర్‌న్ని ఫామ్ హౌజ్ లోపల కేటీఆర్ గొంతు పిసికిండో ఎమోనన్న అనుమానం వస్తుందని తీన్మార్ మల్లన్న అంటున్నారు. మరీ తీన్మార్ మల్లన్న అనుమానం వ్యక్తం చేసినట్లు ఫామ్‌హౌస్‌లో ఏం జరిగిందో ఏమో కానీ.. గత కొన్ని రోజులుగా కేసీఆర్ మాత్రం కనిపించడం లేదని మంత్రి సురేఖ హాట్ కామెంట్స్ చేశారు. గజ్వేల్ నియోజవర్గం నుండి గెలిచిన వ్యక్తి సలహాలు ఇవ్వమంటే ఎక్కడున్నాడో తెలియదని.. మిమ్మల్ని గెలిపించిన గజ్వేల్ ప్రజలకు కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలని కేసీఆర్‌ని నిలదీశారు. మా ఎమ్మెల్యే కనబడటం లేదని పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టమని కోరుతున్నానని గజ్వేల్ ప్రజలకు సూచించారు. మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ ఎందుకు గెలువలేకపోయిందనే భావన నాలో ఉందన్నారు. బీజేపీకి బీఆరెస్ అమ్ముడు పోవడం వల్లనే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మెదక్‌లో ఓటమి పాలయ్యారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత జైల్ నుండి బయటికి రావడం కోసం చీకటి ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. మెదక్‌లో మేము గెలువకున్న సరే బీజేపీని గెలిపించాలనే విధంగా బీఆర్ఎస్ పని చేసిందని మండిపడ్డారు. ప్రజలకు సేవ చేయడానికి మేము ముందుకు పోతుంటే.. పనికి మాలిన సోషల్ మీడియాతో కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ తప్పడు ప్రచారం చేయిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలుకావడానికి ప్రధాన కారణం కేటీఆర్ అని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. అధికారం కోల్పోయే సరికి కేటీఆర్‌కి మతిభ్రమించి తిరుగుతున్నాడని ఫైర్ అయ్యారు. హైడ్రా, మూసీ అంటూ కేటీఆర్ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపుతున్నాడని.. అస్సలు మూసీ ప్రక్షాళనకు తెరలేపింది బీఆర్ఎస్ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకిస్తూ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపితే ఊపేక్షించబోమని.. ఇకనైనా ఒళ్ళు దగ్గర పెట్టుకుని ఉండాలని ఈ వేదిక ద్వారా హెచ్చరిస్తున్నానని సురేఖ వార్నింగ్ ఇచ్చారు.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో ఎన్నో లాభాలు

- సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం

**కరీంనగర్,అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫ్యామిలీ డిజిటల్ కార్డు వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం తాహెర్ కొండాపూర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇది కార్డులో లేని వివరాలు తెలుసుకొని నమోదు చేయించే కార్యక్రమని చెప్పారు. కొత్తగా పెళ్లి అయిన వారి, మృతి చెందిన వారి వివరాలు అప్డేట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. 'వన్ స్టేట్ వన్ కార్డు'లో భాగంగా లాంచ్ చేస్తున్నట్లు చెప్పారు.ఇంటి మహిళను గృహ యజమానిగా గుర్తించనున్నాం. ఇదే కార్డు ఆరోగ్యానికి, రైతుబంధు, బీమా తదితరాలకు ఉపయోగపడుతుంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ కార్డు సర్వే ప్రారంభిస్తున్నాం. కుటుంబానికి ఒక గుర్తింపు ఉండేలా కార్డు తయారు చేస్తాం. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. గత ప్రభుత్వంలో మాదిరి రూ.లక్షను నాలుగు సార్లు ఇవ్వడం లేదు. ఒకేసారి మాఫీ ఇచ్చాం. రేషన్ కార్డు లేక రుణమాఫీ ఆగిన వాళ్లకు అతి త్వరలో తప్పకుండా వస్తుంది. ఈ డిజిటల్ కార్డు వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. మీ కుటుంబ ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ఇందులో పొందుపరుస్తారు. ఈ కార్యక్రమంలో లోటుపాట్లు ఏమైనా ఉంటే అధికారులకు ధైర్యంగా చెప్పవచ్చు. మిగతా ప్రాంతాల్లో సమస్య లేకుండా చూసుకునే అవకాశం ఉంటుంది' అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.



## కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోండి

- నాంపల్లి కోర్టులో కేసు దాఖలు చేసిన నాగార్జున



**హైదరాబాద్,అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నాంపల్లి కోర్టులో నాగార్జున పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో నాగార్జున కోరారు. శుక్రవారం నాగార్జున పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది. 'మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు అసంబద్ధం. అబద్ధం' అని సినీ నటుడు అక్కినేని నాగార్జున ఇప్పటికే ఎక్స్ వేదికగా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. 'రాజకీయాలకు దూరంగా ఉండే సినీప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థులను విమర్శించేందుకు వాడుకోకండి.. సాటి మనుషుల వ్యక్తిగత జీవితాలను గౌరవించండి' అని సూచించారు. సురేఖ వ్యాఖ్యలను బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఖండించారు. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మంత్రి కొండా సురేఖ వాఖ్యలు తమ కుటుంబం పట్ల, చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమని, అబద్ధమని తేల్చిచెప్పారు. తక్షణమే ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.తమ కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అసంబద్ధ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సినీనటుడు అక్కినేని నాగార్జున సతీమణి, నటి అకినేని అమల ఫిర్యాదుచేశారు. తన కుటుంబంపై సురేఖ అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. రాజకీయ వివాదాల్లోకి తమను లాగవద్దని, తన భర్త గురించి నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఘాటుగా స్పందించారు.

# రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

**● అర్హులైన ప్రతి రైతుకు రుణ మాఫీ చేసి తీరుతాం**

**● తెలంగాణ రాష్ట్ర కో - ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు**



**హనుమకొండ ప్రతినిధి: అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను రాజును చేయడమే ప్రథమ కర్తవ్యం అని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు అన్నారు. గురువారం పర్వతగిరి మండలం చౌటపల్లి సొసైటీ పరిదిలో రూ. 60 లక్షలతో నిర్మించిన గోదాం లను, ఒక కోటి నలభై లక్షల రూపాయలతో నిర్మించిన సొసైటీ భవన కార్యాలయాలను మరియు దాదాపు రూ. 13 కోట్ల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క,వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో కలిసి టేస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వారు మాట్లాడుతూ..దేశ చరిత్రలోనే కాంగ్రెస్ ఒక సహాసోపేతమైన నిర్ణయం తీసుకునీ రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయడం జరిగింది. ప్రజల ఆశీస్సులతో అధికారంలో వచ్చాక 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాట కట్టుబడి ముఖ్యమంత్రి రుణమాఫీ చేయడం జరిగింది దేశ చరిత్ర లోనే ఇంత పెద్ద ఎత్తున రుణమాఫీ చేయడం ఇది మొదటిసారి సాంకేతిక కారణాలతో రుణమాఫీ కొంతమేరకు ఆగడం జరిగింది ఆధార్ కార్డు తప్పులు బ్యాంకు వివరాలు సరిగా వంటి కారణాలతో సాంకేతిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. సాంకేతిక కారణాలతో రుణమాఫీ ఆగిపోయిన రైతులకు రుణమాఫీ చేసే బాధ్యత ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుంది ఇది రైతు ప్రభుత్వం రైతుల క్షేమం కోరే ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి,కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి,జిల్లా డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,జాయింట్ కలెక్టర్ సంధ్య రాణి,డిసిఓ నిరజ,సొసైటీ చైర్మన్లు గొర్రె దేవేందర్,మనోజ్ గౌడ్,రాజేష్ ఖన్నా,సొసైటీ డైరెక్టర్లు, జిల్లా,మండల నాయకులు, అధికారులు,రైతులు పాల్గొన్నారు.

---

## మధురానగర్‌లో ఘనముగా శ్రీ దుర్గా మాత శరన్నవరాత్రులు



**గంగాధర, అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్‌లో శ్రీ దుర్గామాత శరన్నవరాత్రులు పురస్కరించుకుని తేదీ : 04-10-2024 శుక్రవారం రోజున మధురానగర్ లోని అమ్మవారి మండపం వద్ద సాయంత్రం 8:00 కుంకుమ పూజా కార్యక్రమం ఉంది.కావున గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనగలరని కోరుకుంటున్నాం.శ్రీ నవదుర్గా శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ – మధురానగర్ ప్రతి రోజు పూజా కార్యక్రమం ఉదయం 8:00కి మరియు సాయంత్రం 6:00కి జరుతాయి. ఆలయ కమిటీ తెలిపినారు. భవాని దీక్ష స్వాములు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీ మోసాన్ని విఫలం చేసిన కెనరా బ్యాంకు




**ఖమ్మం, అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** ఖమ్మం నగరంలోని జుబిలిపుర కెనరా బ్యాంక్ శాఖలో ఒక సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ గ్రూపులకి సంబంధించిన మెప్మ ఆర్పీ చేసిన విఫలయత్నం నివ్వెరపరిచింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం నగరంలోని కెనరా బ్యాంక్ కి గత కొన్ని రోజులక్రితం వేరే బ్యాంక్ లోని హెల్ప్ గ్రూప్ లోన్ లని టేకోవర్ చేసికొని లోన్ సౌకర్యం కల్పించాలని విన్నపాలు వచ్చాయి. బ్యాంక్ వారు నియమాలనుగుణంగా కావల్సిన పత్రాలని సమర్పించాలని సూచించారు. తదుపరి అవసరమైన పరిశీలన చేసి బ్యాంక్ లోన్ మంజూరు చేసారు. ఈ ప్రక్రియలో భాగంగా గ్రూప్ సభ్యుల ఖాతాలోకి జమ చేయవలసిన సమయంలో కెనరా బ్యాంక్ సిబ్బంది గ్రూప్ సభ్యులను విచారిస్తుండగా, గ్రూప్ లీడర్లు తమకు 20 లక్షల రుణం మంజూరు అయినట్టు మెసేజ్ వచ్చినదని కానీ వారికి 10 వేలు రూపాయలు సబ్సిడీ వచ్చింది, తిరిగి వాటిని చెల్లించవలసిన అవసరం లేదు అని మెప్మా రిసోర్స్ పర్సన్ చెప్పినట్లుగా తెలిపినట్లు గురు సభ్యులు బ్యాంక్ సిబ్బందికి తెలిపారు. తమకు ఈ లోన్ తో ఎటువంటి సంబంధం లేదని 20 లక్షల రుణం గురించి తమకు చెప్పకుండా 10000 సబ్సిడీ వస్తుందంటే మాత్రమే తాము అప్లికేషన్పై సంతకాలు పెట్టామని వారు వివరించారు. సభ్యుల సమాచారం మేరకు జరిగిన మోసపూరిత చర్యని బ్యాంక్ వారు గుర్తించి సంబంధిత మెప్మా ఖమ్మం విభాగం వారి దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకునేల భరోసా పొందారు. అటుపిమ్మట బ్యాంక్ సిబ్బంది అన్నీ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లని ఉద్దేశిస్తూ, ఏ ఊరి నుండి అయిన సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లు ఋణాలు అవసరం ఉన్నట్లయితే బ్యాంక్ వారిని నేరుగా సంప్రదించి లబ్ధి పొందగలరని సూచించారు. ఇట్టి మోసపూరిత చర్యని సకాలంలో గుర్తించి పెద్ద మోసాన్ని కెనరా బ్యాంకు చాకచక్యంగా స్పందించి నివారించగలిగారు. సకాలంలో కెనరా బ్యాంకు స్పందించిన తీరు అద్భుతం అని చెప్పవచ్చు. బ్యాంకు ఎంత జాగ్రత్త గా కస్టమర్ సేవలు అందిస్తున్నాయి అనే విషయాన్ని మరోసారి రుజువు చేశారు. మోసానికి పాల్పడ్డ మెప్మా రిసోర్స్ పర్సన్ పై కెనరా బ్యాంక్ చట్టపరమైన చర్యల్ని తీసుకుంటామని తెలియజేసినది.

## దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

**● కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ**



**చిట్యాల, అక్టోబరు 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** దుర్గామాత ఆశీస్సులతో మండల ప్రజలు సంతోషంగా ఉండాలని భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మొకిరాల మదువంశీకృష్ణ ఆకాంక్షించారు. చిట్యాల మండలంలోని నైన్ పాక,చిట్యాల (చింతళ్లపల్లి), తిర్మలాపూర్, చల్లగరిగె, జడల్ పేట, గోపాలపురం గ్రామాల్లో దుర్గాదేవి మండపాలను దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి అలంకరణకు 10 చీరల చొప్పున సమర్పించడం జరిగింది. ఈసందర్భంగా రామకృష్ణ పరమహంస ట్రస్ట్ సభ్యులు మధు వంశీని శాలువతో సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నరేందర్ స్వామి,నక్క భాస్కర్, కంచర్ల రమేష్, సుదగాని ప్రభాకర్, నూక వీరయ్య, , నాపాక చైర్మన్ యాదండ్ల రాజయ్య, నక్క రవి,చిన్నాల శ్రీనివాస్,నూక రాజు,మహేష్,శివ,రమేష్, చిన్నాలసాయి, వెంకటేశ్వర్లు,సావటి రవి,గడిపెల్లి విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాలలో పాల్గొన్న మేడిపల్లి సత్యం





**గంగాధర, అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కోర్టు సర్కిల్ లో నూతన DC ఫ్లెక్స్ ప్రింటర్స్ షాప్ ను ప్రారంభించిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద ప్రజలు ఆరోగ్యానికి ఆర్థిక భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి..



**హనుమకొండ ప్రతినిధి: అక్టోబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** పేద ప్రజల ఆరోగ్యానికి సంజీవనిల ఉపయోగపడేది, అధిక భరోసాను కల్పించేదే పీఎం రిలీఫ్ ఫండ్ అని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం స్టేషన్ ఘనపూర్ మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్యే దృషికి రావడంతో వారికీ ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2లక్షల 50వేల రూపాయల ఎల్ ఓ సి ని వారి కుటుంబ సభ్యులకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం బాధితులకు అందిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నీరుపేద విద్యార్థికి అండగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**- కడియం ఫౌండేషన్ ద్వారా మెడికల్ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే**



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్):** ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామానికి చెందిన చిట్యాల నితిన్ మహబూబాబాద్ లోని మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించి ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కడియం ఫౌండేషన్ ద్వారా కళాశాల ఫీజు నిమిత్తం మెడికల్ విద్యార్థి చిట్యాల నితిన్ కు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు పేద ప్రజలకు సేవ చేయాలని సూచించారు. దింతో తన పరిస్థితిని అర్థం చేసుకొని ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, కడియం ఫౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**● వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (పీసీడబ్ల్యు న్యూస్):** రైతు సంక్షేమనికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామంలో సుమారు 2కోట్లతో నిర్మించిన సొసైటీ భవనం, గోదాం ప్రారంభోత్సవాలు రూ. 12కోట్ల 43లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వం, రైతు పక్షపాత ప్రభుత్వంమని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎక్కకాలంలో రైతులకు 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది, సీఎం రేవంత్ రెడ్డి దే నని అన్నారు. ప్రతీ కుటుంబానికి త్వరలోనే డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వనున్నట్లు దీని ద్వారా రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరి సమగ్ర ఆరోగ్య సమాచారం పొందుపర్చనున్నట్లు తెలిపారు. మహిళా సంక్షేమనికి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టినట్లు వివరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో 100పడకల అస్పత్రి మంజూరు అయిందని వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ని కోరారు. అలాగే పర్వతగిరిలో 30పడకల అస్పత్రి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నేను పర్వతగిరి బిడ్డనేని తాను పుట్టి పెరిగింది పర్వత గిరిలోనేనని తెలిపారు. పర్వతగిరి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆపేక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి, డీఆర్ డీవో కౌసల్య, డిసివో నీరజ, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ ఆంగోత్ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చేప పిల్లల విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొన్న వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** 100% సబ్సిడీపై ప్రభుత్వం అందజేసిన చేప పిల్లలను కరీంనగర్ పట్టణంలోని లోయర్ మానేరు డ్యాం రిజర్వాయర్లో గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విడుదల చేశారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో నూ పాల్గొన్నారు. ఇందులో రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## లోయర్ మానేరు డ్యామ్‌లో చేప పిల్లలు విడుదల చేసిన మంత్రి

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని లోయర్ మానేరు డ్యాంలో 100 శాతం సబ్సిడీతో చేప పిల్లల విడుదల కార్యక్రమం ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. లోయర్ మానేరు డ్యాంలో గంగమ్మ తల్లికి పూజలు చేసి చేప పిల్లలను విడుదల చేశారు. ముఖ్య మంత్రి పట్టుదల కులవృత్తులు ఉపాధి పొందాలని ఆయన కృషి వల్ల ఈరోజు చేప పిల్లల కార్యక్రమం ప్రారంభమైందన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య పథకాలలో జిల్లాను ముందు ఉంచాలని సూచించిన సూపర్ ఇంటెండెంట్...



**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారు లతో సమీక్ష సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నందు ఏర్పాటు చేయనైనది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని కేంద్ర ఆరోగ్య పథకాలలో రాజన్న సిరిసిల్ల ను ముందు ఉంచాలని సూచిస్తూ, లక్ష్యాలను సాధించలేని వైద్య అధికారులను హెచ్చరిస్తూ లక్ష్యాలను సాధించాలని దిశ నిర్దేశం చేసినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పెంచలయ్య సూపర్ డెంట్ ఏరియా హాస్పిటల్ వేములవాడ, ఎస్ రజిత డిప్యూటీ డి ఎం హెచ్ ఓ, అంజలి ఆర్బ్లూర్డ్ ఎం సి హెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆశిఖే ముస్తఫా కాన్ఫరెన్స్...





**కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని ఏడవ డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో గత (15) సంవత్సరాల నుండి మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకొని ఆశిఖే ముస్తఫా కాన్ఫరెన్స్ నాత్ షరీఫ్ అలపన కార్యక్రమం సున్ని మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాదిరి ఆధ్వర్యంలో జరిగింది. త్రీటౌన్ సీఐ జాన్ రెడ్డికి, పోలీసు సిబ్బందికి సున్ని మర్కజీ మీలాద్ కమిటీ, ఆశిఖే ముస్తఫా కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సయ్యద్ బుర్హానుద్దీన్ ఖాద్రీ అధ్యక్షత వహించగా, సయ్యద్ బిలాలుద్దీన్ అహ్మద్ ఖాద్రి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

## 8న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా




**బయ్యారం, అక్టోబర్ 3. (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 08-10-2024 మంగళ వారం జిల్లాలో ని ఎ.బి పంక్షన్ హాల్ నందు మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ పి సుధీర్ రాంనాధ్ కేకెన్ తెలిపారు.ఈ సందర్భంగాజాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు.గురువారం ఎస్పీ కార్యాలయంలో మెగా జాబ్ మేళాకు సంబంధించి పోస్టర్లను అడిషనల్ ఎస్పీ చెన్నయ్య విడుదల చేసి, మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాకు చెందిన యువతీ,యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళా నిరుద్యోగ యువత కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.చాలా కంపెనిలు పాల్గొంటాయని కనీస వేతనం రూ.12 వేల నుంచి ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లమా, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, పార్మసీ విద్యార్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాజరయ్యే అభ్యర్థులు పోస్టర్‌లోని స్కానర్‌ను స్కాన్ చేస్తే బయోడేటా ఫామ్ వస్తుందని, అందులో ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బయోడేటా ఫామ్‌తో పాటు జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఏ ఎస్పీ చెన్నయ్య కోరారు.



## వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఏసిటిఓ గజిటెడ్ హెూదా వెంటనే కల్పించాలి...

- ఐటి ఇండస్ట్రీస్ మంత్రి శ్రీధర్ బాబుకు టిసిటి ఎన్జీవోస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ సంఘం పక్షాన రిప్రజెంటేషన్ ద్వారా విజ్ఞప్తి



**హైదరాబాద్, అక్టోబర్ 03 (పిసి డబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్ లో గురువారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఐటి మరియు ఇండస్ట్రీస్ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు కు తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో జి ప్రభాకర్, పి ప్రవీణ్ కుమార్ జి. శ్రీనివాస్, ఎం ఎం శర్మ, పి. అజయ్ కుమార్ కలసి గత ఏడు సంవత్సరాల నుండి వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఏ సి టి ఓ లకు గజిటెడ్ హెూదా కల్పించాలని మంత్రి శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి చేయగా డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ మీయొక్క సమస్యను పరిష్కరించడానికి నా వంతు కృషి చేస్తానని టి సి టి ఎన్జీవో సంఘం నాయకులకు హామీ ఇచ్చారు తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వాణిజ్య పనుల శాఖ ఏ సి టి ఓ గెజిటెడ్ హెూదా కల్పించాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం గత రెండు పిఆర్సిలు ఫైనాన్స్ క్లియరెన్స్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్ టు ఉద్యోగుల క్రింద వీరు వస్తారు గనుక వీరిని ఏ సి టి ఓ లకు గజిటెడ్ హెూదా ఇవ్వాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేఖ కూడా ఇవ్వటం జరిగింది మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జేఏడీ సర్వీసెస్ క్లియరెన్స్ ఇవ్వడం జరిగింది కానీ ఇప్పటివరకు తెలంగాణ వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఏ సి టివో లకు రాకపోవటం చాలా బాధాకరమైన విషయమని తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బిజెపి సిపిఐ ఎంఐఎం మరియు రాష్ట్ర మంత్రులు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేఖలు కూడా రాయటం జరిగింది అయినప్పటికీ ఏసిటిఓలకు గజిటెడ్ హెూదా ఇప్పటివరకు కూడా రాలేదు కనుక మంత్రి డి శ్రీధర్ బాబు చొరవ తీసుకొని వెంటనే ఎసిటిఓలకు గెజిటెడ్ హెూదా వచ్చినట్లు ప్రయత్నిం చాలి, వాణిజ్య పనుల శాఖలో ప్రమోషన్లు బదిలీలు వెంటనే చేపట్టాలని మొహమ్మద్ ముజాహిద్ విజ్ఞప్తి చేశారు.

## స్వచ్ఛ కాప్రా నిర్మాణాన్ని ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలి

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనురాధ




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఆక్టోబర్ 3,(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా పారిశుధ్య నిర్వహణలో దేశంలోనే టాప్ టెన్ జాబితాలో చోటు సంపాదించాలని, స్వచ్ఛ కాప్రా నిర్మాణాన్ని ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనురాధ కోరారు. గురువారం సఫాయి మిత్ర సురక్ష శివిర్ లో భాగంగా కాప్రా సర్కిల్ లో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబుతో కలసి ర్యాలీకి ఆమె జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కమలానగర్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం మీదుగా తిరిగి కాప్రా సర్కిల్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ నిర్వహించారు. అనంతరం కాప్రా సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో వారు సానిటేషన్, ఎంటమాలజీ సిబ్బంది చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో చేపట్టనున్న పలు అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. విధి నిర్వహణపై అధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన పది మంది సిబ్బందికి బహుమతులను అంద జేశారు. ఈ సందర్భంగా విధి నిర్వాహణలో ఉపయోగించే గ్లౌజులు, మాస్కులు సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిసి జగన్, ఏంహెచ్ఓ, ఎంటమాలజీ ఏఈ డి. రమేష్, ఎంటమాలజీ సూపర్ వైజర్లు, పరమేష్, నరసింహ గౌడ్, కనకయ్య, నరేందర్ రెడ్డి, ఎంటమాలజీ,శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ మహా డేంజర్

- ఎన్‌బిఎంఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు రవి రాజ్ రాథోడ్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఆక్టోబర్ 3,(పిసిడబ్ల్యూ న్యూస్):** రోజురోజుకు పెరుగుతున్న లోడ్ గ్రేటర్ సిటీ నుంచి డైలీ 7 వేల టన్నుల చెత్త అక్కడికే..మరో మూడు ప్లాంట్లు ఏర్పాటు చేయలి ఎన్జీటీ ఆదేశాలను సైతం సర్కార్ లెక్కచేయట్లే ఎన్నికల సమయంలోనే డంపింగ్ యార్డు ముచ్చటలీచెట్ ట్రీట్?మెంట్ ప్లాంట్ ఏర్పాటైనా ఫలితం లేదు. డంపింగ్ యార్డ్ నిర్వహణ పనులు స్టార్ట్? చేసినప్పుడు గ్రేటర్ సిటీ నుంచి రోజుకు 2,500 – నుంచి 3 వేల టన్నుల చెత్త యార్డ్?కు వచ్చేది. అప్పట్లో దానికి తగ్గట్లు నిర్వహణ సంస్థ రాంకీ ఏర్పాట్లు చేసుకుంది. వాటర్ పొల్యూషన్.. యార్డు పరిసరాల్లో నివసించే ప్రజలు దుర్వాసన కారణంగా శ్వాస పీల్చుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాల నిర్వహణలో లోపాలతో తమ బతుకులు ఆగమైతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు సమస్య రోజురోజుకు డేంజర్ గా మారుతుంది. దుర్వాసన మరింత ఎక్కువైంది. ఇక్కడ సమస్య లేకుండా ఉండటానికి దుండిగల్, సంగారెడ్డి జిల్లా ప్యారనగర్, బీబీ నగర్ లోని యాచారం, లక్డారంలో కొత్తగా ప్లాంట్లు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ ఇందులో దుండిగల్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీన్ని త్వరగా ఓపెన్ చేయడంతో పాటు మిగతా చోట్ల త్వరగా నిర్మించాలని ఎన్ బి ఎం ఐ జిల్లా అధ్యక్షులు రవి రాజ్ రాథోడ్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## అన్ని శాఖల పర్మిషన్లతోనే శ్రీ రామకృష్ణ సేవా సమితి నిర్మాణం

- శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కట్టంగూరి సత్యనారాయణ రెడ్డి



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ పట్టణంలోని కె.ఎల్.ఎన్.రెడ్డి కాలనీలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ధ్యాన మందిరం అన్ని ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం 'కుడా' మున్సిపల్ తదితర శాఖల పర్మిషన్లతో మాత్రమే నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎవరివల్ల బెదిరింపులకు గురైనా ఈ స్థలం కాపాడుకోవడానికి అహర్నిశలు శ్రమించడానికి సిద్ధంగా ఉన్నామని శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కట్టంగూరి సత్యనారాయణరెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం హనుమకొండ కే ఎల్ ఎన్ రెడ్డి కాలనీలోని శ్రీ రామకృష్ణ సేవా సమితి ధ్యాన మందిరంలో సమితి అధ్యక్షులు కట్టంగూరి సత్యనారాయణరెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ స్థలం కె.ఎల్.ఎన్.రెడ్డి కాలనీ స్థలమని అభూత కల్పనలతో గత 15 సంవత్సరాలుగా కాలనీ వాసులను రెచ్చగొట్టి, పెడదారి పట్టిస్తున్న వ్యక్తి ఎవరో జనాలకు తెలుసని, లే-అవుట్ అనుమతిలేని కాలనీకి కమ్యూనిటీ స్థలం ఎక్కడుంటుందన్నారు. అతడిని చాలా మంది యోగులు కలిసారని, కేదారినాథ్ గుహల్లో ధ్యానం చేసే 25 మునులకు ఇక్కడినుండి ఫోన్ ద్వారా పిరమిడ్ శక్తిని, ఆనాపానసతి ధ్యానం గురించి తెలిపినట్లు తీసిన బ్రోచర్ చూస్తే విస్తుపోక తప్పదని, ఈ కాలనీ వాసులను ఏమార్చడం ఓ లెక?నా అనిపిస్తుందన్నారు..! మాపై ఆరోపణలు చేస్తున్న వ్యక్తులు ఈ కాలనీకి ఏం చేశారని, ఎప్పుడు వచ్చారని, ఎలా వచ్చారని అని తెలిస్తే వారి-వారి పాత్ర బాధ్యత తెలుస్తుందన్నారు. అసలు ఈ కాలనీ లేదా ఈ స్థలము ఏయే సర్వే నంబర్ల పరిధిలో ఉన్నవి? వీళ్లకు ఎలా సంక్రమించినవి? వాళ్ళ వాదన గురివింద గింజ నీతిని తలపిస్తుందని, అందరికీ ఇంటి నంబర్లే చట్టమైనప్పుడు, రామకృష్ణ సేవ సమితి ధ్యాన మందిర్ కు ఆ చట్టం వర్తించదా అని ప్రశ్నించారు? రామకృష్ణ ధ్యాన మందిర్ కు ఇంటి నంబరుతో పాటుగా భూమి పట్టేదారు అనుమతి ఉందని, సీలింగ్ మినహాయింపు వుందని జి౦3 బిల్డింగ్ కట్టుకునే పర్మిషన్ వుందని వివరించారు. బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి జనరల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, సభ్యులు కే కుమారస్వామి, కెవి రావు, కే సూర్య, ఆంజనేయ, అంజనీ దేవి, పడిదల అనిత, బోయిన్పల్లి పార్వతి పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఆధారంగానే రేషన్ కార్డులు

**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ఆధారంగానే.. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం కాజీపేట 48 వ వార్డులోని రామాలయం వీధిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే ను ప్రారంభించి మాట్లాడుతూ.. వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలోని 48 వ వార్డు,పదవ వార్డుల ను పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి ఇక్కడ నుంచే సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. ఈ డిజిటల్ కార్డుల వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని వీటి ద్వారా ప్రభుత్వానికి చాలా సమాచారం అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రజలకు ఏదైనా పథకం ఇవ్వాలన్నప్పుడు వీటి ఆధారంగానే అందించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి చాలా శ్రద్ధ తీసుకుంటూ త్వరగా కార్డులు జారీకి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ 48 వ వార్డులో సర్వే ప్రారంభించినట్లు, ఈ వార్డులో లిస్టులో ఉన్న కుటుంబాల వివరాలు ప్రింట్ చేసి ఇవ్వడం జరిగిందని, వీటి ప్రకారం చనిపోయిన వారిని తీసివేస్తూ కుటుంబంలో జన్మించిన మరియు కొత్తగా వచ్చి నా వారిని చేర్చడం జరుగుతుందని తెలిపారు. అలాగే కొత్తగా షిఫ్ట్ అయిన కుటుంబాల వివరాలను చేర్చడం జరుగుతుందని కుటుంబంలో సీనియర్ అయిన మహిళ ను కుటుంబ పెద్దగా పరిగణించి కార్డు లు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. తాళాలు వేసి ఉంటే లేదా సర్వే వారు వచ్చినప్పుడు లేనివారి వివరాలను అవార్డులో ఒకచోట సర్వే చేసిన చేసే వారిని ఉంచడం జరుగుతుం దని వారు సర్వే చేసే వారి దగ్గరికి వచ్చి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర









ప్రభుత్వం డిజిటల్ కార్డులు ఇవ్వాలని ఉద్దేశంతో ఉందని దానిని మీరందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జి డబ్ల్యూ ఎం సి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో 48, 10 వార్డులను పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించటం జరిగిందని, ఈ సర్వే కొరకు 12 టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డిఓ వెంకటేష్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, కాజీపేట తాసిల్దార్ బావ్ సింగ్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బ్లాక్ మార్కెట్కు ఉల్లిగడ్డలను తరలించిన వ్యక్తుల గుత్తేదారులు సంస్థలపై చర్య తీసుకోవాలి



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, ఈ నెల 3వ తేదిన కేంద్రప్రభుత్వం(నాఫెడ్) ద్వారా రాయితీతో కూడిన ఉల్లిగడ్డలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర 30 రూపాయలకే పేద ప్రజలకు పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా అందజేయాలని కరీంనగర్ జిల్లాకు వందలాది టన్నుల ఉల్లిగడ్డను పంపిణీ చేసినప్పటికీ అట్టి ఉల్లిగడ్డను, అట్టి రాయితీ నిత్యావసర సరుకును బ్లాక్ మార్కెట్ కు దళారులు తరలించి పేద ప్రజల పొట్ట గొడుతున్నారు, అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లనే గుత్తేదారులు అక్రమ మార్గంలో గోదాముల నుండి ఏకంగా వివిధ ట్రేడర్స్ లకు పంపిణీ చేయడం జరుగుతుంది, ఈ మధ్యనే శనివారం మార్కెట్ లోని ఒక ట్రేడర్స్ కు 100 టన్నుల ఉల్లిగడ్డ బ్లాక్ లో దళారులు సరఫరా చేయడం జరిగింది, కావున దీనిపై జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని నిత్యవసర సరుకులు, ఉల్లిగడ్డలు పేదలకు అందే విధంగా చూడాలని అలాంటి దుర్మార్గపు అవినీతికి పాల్పడ్డ గుత్తేదారులపై చర్యలు తీసుకొని వారి ట్రేడ్ లైసెన్సులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు నేరెళ్ల రవీందర్, డిఎస్ఎస్ స్టేట్ చీఫ్ సెక్రటరీ శ్రీనివాస్, బిజెపి దళిత మోర్చా నాయకులు లక్ష్మీనారాయణ, డిఎస్ఎస్ నాయకులు తడగొండ రాజేష్, మద్దెల ప్రవీణ్, నేరెళ్ల వెంకటేష్, భాస్కర్, రాజయ్యలు పాల్గొన్నారు.

# చౌటుపల్లి గ్రామంలో పలు ప్రారంభవ, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** పర్వతగిరి మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో పాక్స్ భవనం, 500 మెట్రిక్ టన్నుల 2 గోదామలను మరియు పలు గ్రామాల రోడ్లను శంకుస్థాపన చేసే కార్యక్రమంకు విచ్చేసిన గౌరవ పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కి బొకే అందజేసి స్వాగతం పలికిన జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు కేఆర్ దిలీప్ రాజ్. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# షాపింగ్ ప్రారంభోత్సవంలో కుప్పకూలిన వేదిక

## - నటి ప్రియాంక మోహనన్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

**మహబూబాబాద్,అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** హీరోయిన్ ప్రియాంక మోహనన్ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడింది. ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో అకస్మాత్తుగా ప్రమాదం సంభవించింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి హీరోయిన్ ప్రియాంక మోహనన్, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి విచ్చేశారు. హీరోయిన్ చేతుల మీదుగా షోరూంని ప్రారంభించారు. అనంతరం స్టేజ్ పై ప్రజలతో మాట్లాడే కార్యక్రమం నిర్వహించారు. అయితే వీరిని చూసేందుకు వేదికపైకి ఎక్కువమంది ఎక్కడంతో ఒక్కసారిగా స్టేజి కుప్పకూలింది. దీంతో స్టేజిపై ఉన్న వారంతా కింద పడిపోయారు. ఒకరిపై ఒకరు పడిపోవడంతో పలువురికి గాయాలయ్యాయి. గాయపడ్డ పాలకుర్తి కాంగ్రెస్ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. హీరోయిన్ ప్రియాంక కింద పడిపోయినప్పటికీ ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో ఆమెను వెంటనే షాపింగ్ మాల్ లోపలికి తీసుకువెళ్లారు నిర్వాహకులు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుంది.

# కార్యకర్త కుటుంబానికి చెక్కు అందచేత

**సిద్దిపేట,అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటామని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. తొగుటలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో బీఆర్ఎస్ కార్యకర్త చింత నర్సింహులు మరణించగా, బీఆర్ఎస్ క్రియాశీలక సభ్యత్వం ద్వారా బీమా ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆదేశం మేరకు మృతుని భార్య పద్మకు అందించారు.ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం ద్వారా తెలంగాణను సాధించుకోవడంతో పాటు తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణ అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేయడం జరిగిందన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 9 మా సాలలోనే పరిపాలన వైఫల్యం చెందిందన్నారు.ప్రజలు ఏమి కోల్పోయామో ఇప్పటికే గ్రహించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నా దుబ్బాకలో మాత్రం కాంగ్రెస్‌కి డిపాజిట్ దక్కలేదన్నారు.

# కెటిఆర్, హరీష్ రావుపై కేసు నమోదు



**హైదరాబాద్,అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎమ్మెల్యేలు కేటిఆర్, హరీష్ రావుపై సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎంపి రఘునందన్ రావు, తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై బిఆర్ఎస్‌కు చెందిన సోషల్ మీడియా టీం ట్రోలింగ్ చేశారు. దీనిపై మంత్రి కొండా సురేఖ, ఎంపి రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటిఆర్, హరీష్ రావులే తమ అనుచరులతో సోషల్ మీడియాలో అసభ్యంగా ట్రోలింగ్ చేయించారని మంత్రి సురేఖ, ఎంపి రఘునందన్ రావు ఆరోపించారు. ఈ మేరకు రఘునందన్‌రావు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# శరన్నరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ ప్రతినిధి: అక్టోబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్):** పర్వతగిరి మండల పరిధిలోని కల్లెడ గ్రామంలో శ్రీ దేవి శరన్నరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి విగ్రహనికి ఏర్పాటు చేయగా కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అమ్మవారి విగ్రహానికి పూలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాఘవాపూర్ రెడ్డి వృద్ధాశ్రమం నందు వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు



**పెద్దపెల్లి, అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూన్యూస్):** అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు సందర్భంగా రాఘవపూర్ లోని రెడ్డి వృద్ధాశ్రమంలో వయోవృద్ధులకు జిల్లా మహిళా సాధికారిక కేంద్రం మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అన్న ప్రసన్నకుమారి ఏడిపిహెచ్వో మాట్లాడుతూ వయోవృద్ధులకు పౌష్టిక ఆహారము మరియు అలవాట్లు వ్యక్తిగత పరిశుభ్రత గురించి మాట్లాడుతూ వృద్ధాప్యం అనేది శాపం కాదని ఇది మన జీవితంలో ఒక భాగం అని దీనిని అందరూ ఆనందంగా ఆనందంగా గడపాలని వారిలో ఉన్న ఒంటరితనాన్ని తొలగించేలా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ వారి యొక్క ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు అందరికీ పరీక్షలు చేపట్టి అందరికీ మందుల పంపిణీ చేయించారు.ఈ కార్యక్రమంలో, డాక్టర్ అన్న ప్రసన్నకుమారి ఏడిపిహెచ్వో, డాక్టర్ రాజమౌళి పిఓ ఇన్ సిడి, డాక్టర్ మమత, ఎంవో రాఘవపూర్ ,మధుసూదన్ డిపిసి -2 ఎన్సిడి, జనరల్ స్పెషలిస్ట్ చంద్రు స్వప్న సూపర్వైజర్లు విమల తిరుపతమ్మ, ఏ ఎన్ ఎం ఆ హాదిలక్ష్మి ఆశా వర్కర్లు వృద్ధులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమ్మయ్య నగర్ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సమ్మయ్య నగర్ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలు బతుకమ్మ పాటలు ద్వారా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడిపల్లి సాంబయ్య ,జిల్లపల్లి సుధాకర్, రావుల నరసింహ, రేండ్ల శ్రీనివాస్ , జీడిమెట్ల రవి , డెంగు దామోదర్ ,తౌటం శ్రీనివాస్ ,రావుల వెంకన్న ,తౌటం పెద్ద వెంకటయ్య, మడిపల్లి నరేష్, రావుల వెంకటేష్ ,తౌటం నరసింహ,జిలకర స్వామి, చిట్యాల యాకయ్య, డెంగు నగేష్ ,దేవర సమ్మయ్య , కర్రెం మహేందర్,దానబోయిన రాంబాబు ,తౌటం కుమార్ , తౌటం శేఖర్,చిర్ర రాజేష్, ఘనవేని ప్రసాద్ , గన్నోజు శ్యామ్ ,తిరుపతిలు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యంపై అవగాహన కనిపించాలి: టీపిప జిల్లా అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం



**రామడుగు, అక్టోబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం రేకుర్తిలోని డిఫెన్స్ అకాడమీలో జిల్లా స్థాయి సైకాలజిస్ట్ సమావేశం నిర్వహించారు.ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా పనులు నిర్వహించే ప్రదేశాలలో మానసిక ఆరోగ్యం పై అవగాహన సమావేశములు నిర్వహిం చనున్నట్లు తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్(టీ పి ఏ)జిల్లా అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ యేడు పని ప్రదేశాలలో మానసిక ఆరోగ్యం పై చర్చించుటకు ప్రాధాన్యత ఇవ్వాలని థీమ్ (అంశం) కలిగి ఉందని ఆ ప్రకారమే వివిధ ప్రదేశాల్లో పని చేసే వారికి మానసిక ఆరోగ్యం పై అవగాహన కల్పించనున్న ట్లు తెలిపారు.. ఈనెల 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా జిల్లాలో వివిధ ప్రదేశాల్లో అవగాహన సదస్సులు నిర్వహించుటకు రాష్ట్ర సంఘం నిర్ణయించిందని అన్నారు.. మానసిక ఆరోగ్యంతోనే ఆనంద జీవితం కలుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం పై అవగాహన అవసరమని అన్నారు.. వివిధ ఆర్గనైజేషన్లు వివిధ సంస్థలు,లేదా కర్మాగారాలు తదితర చోట్ల పనిచేసే వారు ఒత్తిడికి గురై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు... కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సోరుపాక ఐలయ్య, ఉపాధ్యక్షుడు గాలిపెల్లి నాగేశ్వర్, రామగిరి రాధిక తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి పరామర్శించిన వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ సిటీ కాంగ్రెస్ ఎస్సి సెల్ ప్రెసిడెంట్ లింగంపల్లి బాబు తల్లి లింగంపల్లి మల్లమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, లింగంపల్లి బాబు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లమ్మ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. మల్లమ్మ చిత్రపటానికి రాజేందర్ రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మల్లమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, బాబు కుటుంబ సభ్యులకు మనోస్థైర్యం కల్పించాలని భగవంతున్ని ప్రార్థించారు. వారి వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు సరిళ్ల రతన్ రాజు, తదితరులు ఉన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలకు షాక్ ఇచ్చిన హైకోర్టు...

## - దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులకు హైకోర్టులో ఎదురుదెబ్బ...



**హైదరాబాద్, అక్టోబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** BRS నుండి కాంగ్రెస్ పార్టీకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే ఇచ్చేందుకు డివిజన్ బెంచ్ నిరాకరణ సింగిల్ బెంచ్ తీర్పుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్ట్ డివిజన్ బెంచ్ఈనెల (24)న వాదనలు వింటామన్న డివిజన్ బెంచ్ఎమ్మెల్యేల అనర్హతపై (20) రోజుల క్రితం సింగిల్ బెంచ్ తీర్పుషెడ్యూల్ ఖరారు చేయాలని ఉత్తర్వులు వెలువరించిన హైకోర్ట్సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేసిన అసెంబ్లీ కార్యదర్శి దానం, కడియం, తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని.. గతంలో హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (పీసీడబ్ల్యూ న్యూస్):** పర్వతగిరి మండల పరిధిలోని సోమారం గోరుగుట్ట తండలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బానోతు కమలమ్మ నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# 11 ఏళ్ల తర్వాత బయటకు వచ్చిన మైఖేల్ షుమాకర్



మైఖేల్ షుమాకర్.. ఫార్ములా వన్ ఆల్ టైమ్ గ్రేట్స్ లో ఒకడు. ఏకంగా ఏడుసార్లు వరల్డ్ ఛాంపియన్. అలాంటి రేసర్.. 11 ఏళ్ల కిందట స్కీయింగ్ చేస్తూ అనూహ్యంగా ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచే ఇంటికే పరిమితమైన అతడు.. ఈ మధ్యే తన కూతురు పెళ్లికి హాజరైనట్లు యురోపియన్ మీడియా వెల్లడించింది. మైఖేల్ షుమాకర్ కూతురి పెళ్లి ఈ మధ్యే స్పెయిన్ లోని మలోర్కాలో జరిగింది. ఈ పెళ్లికి అతడు హాజరయ్యాడని, కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే ఆ సమయంలో అక్కడ ఉన్నారని యురోపియన్ మీడియా చెబుతోంది. 2013లో ప్రమాదానికి గురైన తర్వాత ఇప్పటి వరకూ అతడు బయటకు రాలేదు. ఈ మధ్యే తన కూతురు గినా మారియా పెళ్లి జరగగా.. తన ఫ్యామిలీ విల్లాలో కొత్తగా పెళ్లయిన జంటను ఆశీర్వదించడానికి షుమాకర్ బయటకు వచ్చినట్లు జర్మనీకి చెందిన బిల్డ్ న్యూస్ పేపర్ తెలిపింది. అయితే ఆ తర్వాత ఫ్యామిలీ ఎస్టేట్ కు చెందిన గార్డెన్ లో జరిగిన వేడుకలకు మాత్రం అతడు రాలేదని తెలిపింది. పెళ్లి సమయంలో షుమాకర్ బయటకు వచ్చినప్పుడు కూడా అక్కడే ఉన్న సన్నిహితులు, ఇతర అతిథుల దగ్గర ఉన్న మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సదరు రిపోర్టు చెప్పింది. షుమాకర్ కు సంబంధించిన ఎలాంటి ఫొటోలు, వార్తలు మీడియాలో రాకుండా అతని కుటుంబం 11 ఏళ్లుగా జాగ్రత్తపడుతోంది. ఇక ఇప్పుడు తన తనయుడు మిక్ షుమాకర్ పెళ్లి ఈవెంట్ కు కూడా మైఖేల్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మిక్ ఎఫ్ఐఏ ఎండ్యూరెన్స్ ఛాంపియన్షిప్ లో ఆల్పైన్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మైఖేల్ షుమాకర్ 2013లో ఆల్ప్స్ పర్వతాల్లో స్కీయింగ్ చేస్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాద తీవ్రత ఎంతలా ఉందంటే.. అతడు ప్రాణాలతో బయటపడినా.. అసలు నడవలేని, ఎవరినీ గుర్తుపట్టలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయాడు. 11 ఏళ్లుగా అతనికి సంబంధించి ఎలాంటి ఫొటోలు, వార్తలు బయటకు రాకుండా కుటుంబం చూసుకుంటోంది. మైఖేల్ షుమాకర్ ఫార్ములా వన్ ఆల్ టైమ్ గ్రేట్ రేసర్లలో ఒకడు. 1994 నుంచి 2004 వరకు అతడు ఏడుసార్లు వరల్డ్ ఛాంపియన్ గా నిలిచాడు. 2020లో లూయిస్ హామిల్టన్ అతని రికార్డును సమం చేశాడు. షుమాకర్ రిటైర్మెంట్ సమయానికి అత్యధిక విజయాలు (91), అత్యధిక పోల్ పొజిషన్స్ (68), అత్యధిక పోడియం ఫినిషెస్ (155) లాంటి రికార్డులను సొంతం చేసుకున్నాడు. అంతటి గ్రేట్ ఫార్ములా వన్ రేసర్ దశాబ్దకాలంగా ఇంట్లో మంచానికే పరిమితం కావడం మింగుడుపడనిదే.

# ప్రారంభమైన ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్



## - నేడు న్యూజిలాండ్‌తో టీమిండియా మొదటి మ్యాచ్

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2024 ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో టీమిండియా నేడు న్యూజిలాండ్‌తో మొదటి మ్యాచ్ ఆడనుంది. భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్ దుబాయ్‌లో జరుగనుంది. ఈ టోర్నీలో భారత్ గ్రూప్–ఎలో ఉండగా భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్ , శ్రీలంక ఉన్నాయి. భారత్ అక్టోబర్ 6న పాకిస్థాన్‌తో తలపడనుండగా.. 9న శ్రీలంకతో తలపడనుంది. అక్టోబర్ 13న ఆస్ట్రేలియాతో భారత్ చివరి గ్రూప్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్–ఎలో జట్ల గురించి టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. స్టార్ స్పోర్ట్స్‌లో హర్భజన్ సింగ్ మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాతో భారత్ చాలా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మ్యాచ్‌లు దుబాయ్‌లో జరుగనున్నప్పటికీ.. ఆస్ట్రేలియా బలమైన జట్టు, ఎక్కడైనా ఓడించడం కష్టం. తాజాగా భారత్‌తో సిరీస్ గెలిచిన తర్వాత శ్రీలంక కూడా పెద్ద సవాల్‌గా మారనుంది. ఈ గ్రూప్‌లో న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక వంటి పటిష్టమైన జట్లు ఉన్నప్పటికీ.. భారత్‌కు ఆస్ట్రేలియా అతిపెద్ద పరీక్ష అని హర్భజన్ అభిప్రాయపడ్డాడు. భారత మహిళల జట్టు ప్రపంచకప్‌ను గెలుచుకునే అవకాశాల గురించి మాట్లాడిన హర్భజన్ సింగ్.. 'ఈ టోర్నీని గెలవగల జట్లలో భారతదేశం ఉందని చెప్పాడు. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, అద్భుతమైన స్పిన్నర్ దీప్తి శర్మ వంటి అనుభవజ్ఞులైన క్రీడాకారిణులు ఉన్న ఈ జట్టు ఈ టోర్నీని గెలవగలదు. వారు గొప్పగా క్రికెట్ ఆడుతున్నారు. ఇదే జోరును కొనసాగిస్తే టోర్నీని గెలవవచ్చు. భారత మహిళల జట్టు మైదానంలో ఉంటూ బేసిక్స్‌పై దృష్టి పెట్టాలి' అని హర్భజన్ సూచించాడు. మనసు పెట్టి ఆడాలని, అనవసర ఒత్తిడికి గురికావద్దని చెప్పాడు.

# ఇరానీ కప్‌లో సర్ఫరాజ్ ఖాన్ డబుల్ సెంచరీ!

అరంగేట్ర సిరీస్ లోనే ఇంగ్లాండ్ ఆటగాళ్ల గుండెల్లో భయం సృష్టించిన సర్ఫరాజ్., ఇప్పుడు ఇరానీ కప్‌లో తెగ పరుగులు చేస్తున్నాడు. అద్భుత ఇన్నింగ్స్ ఆడి సరికొత్త రికార్డు సృష్టించాడు. ఇరానీ కప్‌లో సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్, రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాళ్లు కూడా సాధించలేని ఈ రికార్డును సర్ఫరాజ్ ఖాన్ సృష్టించాడు.ముంబై బ్యాట్స్‌మెన్ సర్ఫరాజ్ ఖాన్ 2024 ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియాపై డబుల్ సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. ప్రస్తుత రంజీ ట్రోఫీ ఛాంపియన్స్ రెస్ట్ ఆఫ్ ఇండియా, ముంబై మధ్య జరుగుతున్న ప్రతిష్టాత్మక ఫైనల్ రెండో రోజున సర్ఫరాజ్ ఈ ఘనత సాధించాడు. విశేషమేమిటంటే.. ఇరానీ కప్ చరిత్రలో ముంబై తరఫున డబుల్ సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు తొందరగానే ఔటైన తర్వాత అజింక్య రహానేతో కలిసి సర్ఫరాజ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. రహానే తన డిఫెన్సివ్ స్టైల్‌లో ఆడుతుండగా, సర్ఫరాజ్ మరో ఎండ్ నుంచి దూకుడు ప్రదర్శించాడు. దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ డబుల్ సెంచరీ చేశాడు. ఈ క్రమంలో 15వ ఫస్ట్ క్లాస్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సర్ఫరాజ్‌కి తనుష్ కోటియన్ నుండి మంచి మద్దతు లభించింది. వీరిద్దరూ కలిసి ముంబై స్కోరును 280/6 నుంచి 460కి తీసుకెళ్లారు. సర్ఫరాజ్ తన అద్భుతమైన ఇన్నింగ్స్‌ను కొనసాగించి చివరి సెషన్‌లో డబుల్ సెంచరీ పూర్తి చేశాడు. సర్ఫరాజ్ 253 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేశాడు. దీంతో ఇరానీ కప్ చరిత్రలో ముంబై తరఫున డబుల్ సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో గతంలో ముంబై బ్యాట్స్‌మెన్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు 1972లో ఆర్‌డి పార్కర్ చేసిన 195 పరుగులు. దానిని సర్ఫరాజ్ ఖాన్ బ్రేక్ చేశాడు. రోజు ఆట ముగిసే వరకు సర్ఫరాజ్ 221 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతను తన ఇన్నింగ్స్‌లో 25 ఫోర్లు, 4 సిక్సర్లు కొట్టాడు. మొత్తానికి ముంబై 537 పరుగులకి ఆలౌట్ అయ్యింది.



# మనీలాండరింగ్ కేసులో క్రికెటర్ అజారుద్దీన్‌కు సమన్లు!



మనీలాండరింగ్ కేసులో భారత మాజీ కెప్టెన్, దిగ్గజ బ్యాట్స్‌మెన్ మహ్మద్ అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు ??జారీ చేసింది. 20 కోట్ల నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు సంబంధించినది. నేడు హైదరాబాద్ లోని ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరు కావాలని అజారుద్దీన్‌ను ఆదేశించింది. ఆయనకి ఇదే తొలి సమన్లు. ఇదివరకు అజారుద్దీన్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. తన హయాంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ఆయన ఈరోజు దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాల్సి ఉంటుంది. హైదరాబాద్ లోని ఉప్పల్ లోని రాజీవ్‌గాంధీ క్రికెట్ స్టేడియంలో డీజిల్ జనరేటర్లు, అగ్నిమాపక వ్యవస్థలు, పందిరి కొనుగోలు కోసం కేటాయించిన రూ.20 కోట్లను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఇకపోతే, అజారుద్దీన్ భారత్ తరఫున 99 టెస్టులు, 334 వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 45.04 సగటుతో 6215 పరుగులు, వన్డేల్లో 36.92 సగటుతో 9378 పరుగులు చేశాడు. టెస్టుల్లో 22 సెంచరీలు, 21 హాఫ్ సెంచరీలు.. వన్డేల్లో ఏడు సెంచరీలు, 58 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఇది కాకుండా అజారుద్దీన్ వన్డేల్లో 12 వికెట్లు తీశాడు. అతని అత్యుత్తమ స్కోరు టెస్టులో 199 పరుగులు, వన్డేలో 153 పరుగులు. అజారుద్దీన్ వన్డే ప్రపంచకప్‌లకు కూడా టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.

# రోహిత్‌కే వరల్డ్ కప్ కెప్టెన్సీ.. అభిమానుల డిమాండ్




కరీబియన్ గడ్డపై టీ20 వరల్డ్ కప్ ట్రోఫీ అందుకున్న మరుక్షణమే పొట్టి క్రికెట్‌కు వీడ్కోలు పలికి రోహిత్ శర్మ అందర్నీ ఆశ్చర్యపరిచాడు. కెప్టెన్‌గా దేశానికి తొలి ఐసీసీ ట్రోఫీ అందించిన హిట్‌మ్యాన్ ప్రస్తుతం టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ లక్ష్యంగా జట్టును నడిపిస్తున్నాడు. అయితే.. మరో రెండు మూడు ఏండ్లలో టెస్టులు, వన్డేలకు కూడా రోహిత్ అల్విదా పలికే అవకాశముంది.ఈ నేపథ్యంలో భారత సారథి వచ్చే వన్డే వరల్డ్ కప్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. కానీ, అభిమానులు మాత్రం 2027 వన్డే వరల్డ్ కప్‌లో అతడే టీమిండియా కెప్టెన్‌గా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను క్లీన్‌స్వీప్ చేయడంలో కోచ్ గంభీర్‌తో కలిసి మాస్టర్ ప్లాన్ వేసిన రోహిత్ విజయవంతం అయ్యాడు. సిరీస్ ముగియడంతో రిలాక్స్ అవుతున్న హిట్‌మ్యాన్ తాజాగా ముంబైలో ఓ ఈవెంట్‌కు వెళ్లాడు. అక్కడ ఉన్నవాళ్లంతా అతడిని వచ్చే వరల్డ్ కప్ వరకూ సారథిగా ఉండాల్సిందిగా కోరారు.

# మంత్రి సురేఖ వ్యాఖ్యలపై చిత్రసీమ భగ్గు

**- మండిపడ్డ పరిశ్రమకు చెందిన ప్రముఖులు**

**- చిరు సహా అగ్రతారలంతా ఆగ్రహం**












కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో సమంత, నాగచైతన్య, నాగార్జున పేర్లను ప్రస్తావిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆమె వ్యాఖ్యలపై చిత్రసీమ సీరియస్ అయ్యింది. ఆమె తీరును పరిశ్రమకు చెందిన వారంతా ముక్తకంఠంతో ఖండించారు. ఆమె బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక చిత్రసీమను బజారుకీడ్చడం తగదని హితవు పలికారు. కొండా వ్యాఖ్యలను ఖండిస్తూ అగ్ర కథానాయకుడు చిరంజీవి, వెంకటేశ్, మహేశ్ బాబు, రామ్‌గోపాల్ వర్మ, రవితేజ, దర్శకుడు శంకర్ తదితరులు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. గౌరవనీయులైన మహిళా మంత్రి చేసిన అవమానకర వ్యాఖ్యలు చూసి నేను చాలా బాధపడ్డానని చిరంజీవి అన్నారు. త్వరితగతిన వార్తల్లో నిలిచేందుకు సెలబ్రిటీలు.. సినీ కుటుంబానికి చెందిన వ్యక్తులను సాఫ్ట్ టార్గెట్ చేసుకోవడం సిగ్గు చేటు. చిత్ర పరిశ్రమకు చెందిన సభ్యులపై ఇలాంటి మాటల దాడులను మేమంతా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నాం. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులు, మరీ ముఖ్యంగా మహిళలపై ఇలాంటి ఆరోపణలు చేసి దిగజారవద్దు. సమాజాభివృద్ధి కోసం మేము మా నాయకులను ఎన్నుకుంటాం. ఇలాంటి వ్యాఖ్యలు చేసి వారు తమ స్థాయిని తగ్గించుకోకూడదు. రాజకీయ నాయకులు, గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నవారు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలవాలని చిరంజీవి పేర్కొన్నారు. నాగార్జున కుటుంబాన్ని అత్యంత దారుణంగా అవమానపరిచిన కొండా సురేఖ కామెంట్లకు నేను షాక్ అయ్యా. ఆమె తన రాజకీయ ప్రత్యర్థి మీద పగ తీర్చుకునే క్రమంలో అత్యంత గౌరవప్రదమైన నాగార్జున కుటుంబాన్ని లాగడం ఏ మాత్రం సహించకూడనిదని దర్శకుడు రాంగోపాల్ వర్మ అన్నారు. ఇతరుల వ్యక్తిగత పరిస్థితిని రాజకీయాల కోసం వాడటం నన్నెంతో బాధించింది. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం అని నటుడు వెంకటేశ్ అన్నారు. ముఖ్యమైన నాయకత్వ స్థానాల్లో ఉన్న వ్యక్తులు సంయమనం, సానుభూతి పాటించాలని కోరుతున్నా. మీ చర్యలు, మాటలు జనాల్లో స్ఫూర్తి నింపేలా ఉండాలని కోరుకుంటున్నా అని వెంకటేశ్ పేర్కొన్నారు. ఓ కేబినెట్ మంత్రి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వినటం చాలా బాధాకరం. ఎలాంటి సమాజంలో మనం బతుకుతున్నాం అని నిర్మాత స్వప్నదత్ అన్నారు. ప్రతిసారీ రాజకీయ నాయకులు సినీ పరిశ్రమకు చెందినవారిపై ఇలాంటి నిందలు వేయడం కోపం తెప్పిస్తోందని మంచు లక్ష్మి అన్నారు. రాష్ట్రంలో ఏదైనా భయంకరమైన సంఘటన జరిగినప్పుడు రాజకీయ నాయకులు వారి అజెండాల కోసం సినీ ప్రముఖుల నుంచి మద్దతు కోరుతారు. ఓ మహిళ నుంచి ఇలాంటి ఆరోపణలు మరింత ఎక్కువ బాధ కలిగిస్తున్నాయి. ఇలా రాజకీయాల్లోకి లాగొద్దు. ఇది చాలా అన్యాయం అన్నారు. మీరు కేవలం మహిళలను అవమానించడమే కాదు.. తెలంగాణకు గర్వకారణమైన మొత్తం సినీ పరిశ్రమను అగౌరవపర్చారు. ఇలాంటి విషయాల నుంచి ప్రజలను పాలించడం వైపు దృష్టి మరల్చండి. మీ గౌరవం ఇప్ప టికే తగ్గిపోయింది. దానిని మరింత దిగజార్చద్దనిహీరో సుధీర్ బాబు పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితాలను రాజకీయ వివాదంలోకి లాగడం గీత దాటడమే. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకులు.. ఇతరులపై గౌరవంగా వ్యవహరించాలి. ముఖ్యంగా సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని నిరాధార, నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు చేస్తే తేలిగ్గా తీసుకోం. ఇలాంటి ఆరోపణలనుమేంఎన్నటికీసహించబోంఅని నిర్మాత ఎస్‌కేఎన్ తెలిపారు.



## సినిమా వాళ్లను టార్గెట్ చేయడం ఫ్యాషన్

**- మండిపడ్డ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ**

తెలంగాణ మంత్రి కొండా సురేఖ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీనియర్ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. బాధ్యతగల పదవిలో ఉన్నవారు జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు. మంత్రిగా కొండా సురేఖకు ఏం తెలుసో తెలీదో గానీ.. ముందు గైడ్ లైన్స్ ఫాలో కావాలని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ సినిమా ఇండస్ట్రీలో వారిని టార్గెట్ చేసి మాట్లాడటం తమాషా అయిపోయిందంటూ మండిపడ్డారు. చిత్ర పరిశ్రమ, అందులో పని చేసే వారంటే ఎందుకు అంత చులకన అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటివి రిపీట్ కాకుండా ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. మరో దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఘాటుగా స్పందించారు. 'అక్కినేని నాగార్జున కుటుంబం పై కొండా సురేఖ మాట్లాడిన తీరు చాలా బాధాకరం. రాజకీయ ప్రయోజనాల కోసం సినిమా వారిని టా÷–గ్గ÷ట్ చేయడం శోచనీయం. రాష్టాల్లో ఎప్పుడు ఏ విపత్తు వచ్చినా మేమున్నామంటూ మొదటగా ముందుకు వచ్చే సినిమా వారిని చులకన చేస్తూ మాట్లాడటం తప్పుడు సంప్రదాయం. సురేఖ గారు ఇది మొదలెట్టింది మీరే.. దీన్ని సంస్కారవంతంగా ముగించాల్సిన బాధ్యత కూడా మీదే' అని హరీశ్ శంకర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## దేవర విజయోత్సవ వేడుక

**- సక్సె మీట్ పెట్టలేక పోయామన్న నాగవంశీ**

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన 'దేవర' మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమా సక్సెస్ మీట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ విషయంపై నిర్మాత నాగవంశీ పోస్ట్ పెట్టారు. ఈ ఈవెంట్‌ను భారీగా నిర్వహించాలని అనుకున్నప్పటికీ అనుమతులు లభించలేదని తెలిపారు. సక్సెస్ మీట్‌ను నిర్వహించలేకపోతున్నందుకు అభిమానులను క్షమాపణలు కోరారు. 'దేవర'ని ఈ స్థాయిలో ఆదరించినందుకు అందరికీ ధన్యవాదాలు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంలో సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించలేకపోవడంతో విజయోత్సవ వేడుకనైనా ఘనంగా చేయాలని ఎన్టీఆర్ ఎంతో భావించారు. మేము ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాలు ఉన్న కారణంగా మా వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాల్లో బహిరంగ వేదికలకు అనుమతులు పొందలేక పోయాం. ఈ పరిస్థితి మా నియంత్రణలో లేదు. ఈ ఈవెంట్‌ను నిర్వహించలేకపోతున్నందుకు అభిమానులను క్షమాపణలు కోరుతున్నాం. వేదిక అనుమతి కోసం మేము ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాం. మీ ప్రేమతో ఎన్టీఆర్ మరింత ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నానని పోస్ట్ పెట్టారు. ప్రీ సేల్ బుకింగ్స్‌లోనే హవా కొనసాగించిన 'దేవర'.. విడుదలయ్యాక కూడా మంచి కలెక్షన్లు సొంతం చేసుకుంటోంది. ఇప్పటివరకు రూ.396 కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం తాజాగా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ అలరించగా విలన్‌గా సైఫ్ అలీఖాన్ కనిపించిన సంగతి తెలిసిందే.



## మీ రాజకీయాల కోసం నా పేరుని వాడుకోవడం ఆపేయండి..

**- కొండా సురేఖ వ్యాఖ్యలపై రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్**




తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ ఘాటుగా స్పందించింది. మీ రాజకీయాల కోసం తన పేరును ఇకనుంచి అయిన తీయడం మానేయాలంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.తెలంగాణ కాంగ్రెస్ మంత్రులు టాలీవుడ్ సినీ నటులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. అక్కినేని ఫ్యామిలీతో పాటు టాలీవుడ్ నటి సమంత, బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్‌లపై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ఇక ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే సమంతకు, నాగార్జునకు పలువురు మద్దతుగా నిలిచారు. ఈ కామెంట్స్‌పై టాలీవుడ్ సెలబ్రిటీలు చిరంజీవి, నాని, వెంకటేశ్, మంచు లక్ష్మి, సుధీర్ బాబు, శ్రీకాంత్ ఓదెలతోపాటు పలువురు స్పందించారు. ఇప్పుడు తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ కూడా ఎక్స్ వేదికగా స్పందించింది.ప్రపంచవ్యాప్తంగా సృజనాత్మకతకి.. నైపుణ్యానికి తెలుగు సినిమా ఇండస్ట్రీని ప్రతీకగా చూస్తున్నారు. నేను ఈ ఇండస్ట్రీలో చాలా కాలం ప్రయానించాను ఇంకా అది కొనసాగిస్తున్నాను. ఇటువంటి ఇండస్ట్రీలో మహిళల గురించి నిరాధారమైన దుర్మార్గమైన పుకార్లు వినడం బాధాకరంగా ఉంది. మరి దారుణమైన విషయం ఏంటంటే అవి ఇంకొక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మహిళ నుండి వినడం ఇంకా మనసు విరిచేసేలా ఉంది. గౌరవం కోసం మనం నోరు తెరవకుండా ఉంటే దాన్ని మా బలహీనతగా చూస్తున్నారు.నాకు రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదు. రాజకీయాలకు సంబంధించిన వ్యక్తులతో కానీ పార్టీలతో కానీ నాకు ఎటువంటి సంబంధం లేదు. నా పేరు ని తప్పుడు ఆరోపణలతో మీ రాజకీయాల కోసం వాడుకోవడం ఆపేయండి. ఆర్టిస్ట్‌లను ఈ రాజకీయాల నుంచి దూరంగా ఉంచండి. రాజకీయ విమర్శల కోసం, న్యూస్ హెడ్‌లైన్‌ల కోసం అర్థం లేని కథల్లో మమ్మల్ని లాగకండి అంటూ రకుల్ చెప్పుకోచ్చింది.

## 'గాంధీజీ'పై వెబ్ సిరీస్.. సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్

జాతిపిత మహాత్మా గాంధీపై వెబ్ సిరీస్ రాబోతుంది. ఇప్పటివరకు గాంధీజీపై ఎన్నో సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లు వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు మహాత్ముడి జీవిత కథతో మరో వెబ్ సిరీస్ రాబోతుంది. స్కామ్ 1992, అలీఘర్, షాహిద్, స్కూప్ వంటి సంచలన చిత్రాలు తెరకెక్కించిన బాలీవుడ్ దర్శకుడు హన్సల్ మెహతా ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించబోతుండగా.. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియో నిర్మించబోతుంది. ఈ సినిమాలో గాంధీజీ పాత్రలో స్కామ్ 1992 నటుడు ప్రతీక్ గాంధీ నటించబోతున్నాడు.అయితే ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను మేకర్స్ పంచుకున్నారు. ఈ సిరీస్‌కు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే ఈ వెబ్ సిరీస్ గురించి ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ చేయబోతున్నా. ఈ చిత్రంలో గాంధీజీ జీవితం, సౌత్ ఆఫ్రికాలో ఆయన గడిపిన క్షణాలు, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం గురించి ఉండబోతున్నట్లు తెలిపాడు. హన్సల్ మెహతా దర్శకత్వంలో వస్తున్న ఈ సిరీస్‌కు సంగీతం అందించడం గౌరవంగా ఉందంటూ రెహమాన్ తెలిపాడు.